సాక్షి
రంగారెడ్డి
బుధవారం ׀ 3 ׀ సెప్టెంబర్ ׀ 2025



అలైన్‌మెంట్ ఖరారు

రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అలైన్‌మెంట్ ఖరారైంది. ఈ మేరకు హెచ్‌ఎండీఏ ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. 8లో▸

ఘన నివాళి



షాద్‌నగర్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

న్యూస్‌రీల్

దూర విద్యతో ఉజ్వల భవిష్యత్తు

ఇబ్రహీంపట్నం: దూర విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ధర్మనాయక్ అన్నారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని దూరవిద్య స్టడీ సెంటర్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కౌన్సిలర్ల సమావేశంలో మాట్లాడారు. రెగ్యులర్ విశ్వవిద్యాలయాలతో సమానంగా సార్వత్రిక విశ్వవిద్యాలయంలో అన్ని కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, జర్నలిజం, లైబ్రరీ సైన్స్, ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంబీఏ తదితర కోర్సులు అందిస్తున్నట్లు వివరించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి డిగ్రీలో బీబీఏ కోర్సును ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. మిగతా యూనివర్సిటీలతో పొల్చుకుంటే అంబేడ్కర్ యూనివర్సిటీలో ఫీజులు చాలా తక్కువగా ఉన్నట్లు చెప్పారు. రెగ్యులర్ డిగ్రీలు చేయలేని వారు, ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, గృహిణులు, వ్యాపారస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దూరవిద్య డిగ్రీకి రెగ్యులర్ డిగ్రీతో సమానమైన విలువ ఉంటుందన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ రాధిక పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



పూజల్లో డీసీపీ సునీతారెడ్డి తదితరులు

మంచాల: వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని విశ్వహిందూ పరిషత్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపం వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, సీఐ మధు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీలింగ్ భూ సమస్యలు పరిష్కరించండి



అనాజ్‌పూర్‌లో దీక్ష చేస్తున్న భూ బాధితులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని అనాజ్‌పూర్‌లో సర్వేనంబర్ 274తో పాటు పలు సర్వే నంబర్లలోని భూముల్లో కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సీలింగ్ భూముల సమస్యలు తక్షణం పరిష్కరించాలని భూబాధితులు కోరారు. రైతులకు పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ భవనం వద్ద మంగళవారం దీక్ష చేపట్టారు. కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర నాయకుడు పి.జంగారెడ్డి హాజరై మాట్లాడారు. రైతులు చేస్తున్న సీలింగ్ పోరాటం న్యాయమైందని అన్నారు. రైతుల కళ్లలో కన్నీళ్లు తెప్పించిన ప్రభుత్వాలు ఎక్కువ కాలం అధికారంలో ఉండలేవన్నారు. ఎన్నో ఉద్యమాలతో రైతులకు సీలింగ్ పట్టాలు వచ్చాయని, సెత్వారులో పేర్లు వస్తున్నప్పటికీ ఆన్‌లైన్‌లో చేర్చకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించే వరకు రైతుల పోరాటానికి ఎర్రజెండా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ముత్యాలు, జంగయ్య, బాలరాజు, మహేశ్, రైతులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా చెట్ల నరికివేత!



చెట్లను నరికి పక్కన పడేసిన దుంగలు

ఇబ్రహీంపట్నం రూరల్: వన మహోత్సవం పేరుతో ప్రభుత్వం ఓ వైపు మొక్కలు నాటిస్తుండగా.. మరోవైపు కొంతమంది పచ్చని చెట్లపై గొడ్డలి వేటు వేస్తున్నారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని సాహెబ్‌గూడ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏపుగా పెరిగిన చెట్లను ఇష్టారాజ్యంగా నరికేశారు. విద్యుత్ తీగలకు కొమ్మలు తగులుతున్నాయనే సాకుతో మొదట కాండాలు తొలగించి, రెండు రోజుల తర్వాత మొదళ్ల వరకు కోత పెట్టారు. ఇది చూసిన స్థానికులు, పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణను వివరణ కోరగా.. స్కూల్ ఆవరణలోని చెట్ల కారణంగా పిట్టలు, పాములతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని విన్నవించడంతో తొలగించామన్నారు.

‘జంట’కు ట్రీట్‌మెంట్



హిమాయత్‌నగర్‌లో గండిపేట జలాశయం వద్ద నిర్మిస్తున్న ఎస్టీపీ కేంద్రం

మురుగు ముప్పు తప్పించేందుకు..

- హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల ఎగువ ప్రాంతాల్లో నాలుగు ఎస్టీపీల నిర్మాణం
- శుద్ధ జలమే లక్ష్యంగా జలమండలి చర్యలు
- రూ.82.23 కోట్లతో శరవేగంగా సాగుతున్న నిర్మాణ పనులు
- వచ్చే ఏడాది మార్చినాటికి పూర్తి చేసే యోచన

మొయినాబాద్: హైదరాబాద్ మహానగరానికి తాగునీరు అందించే హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ (గండిపేట) జంట జలాశయాల్లో మురుగునీరు చేరకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఎస్టీపీల (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు) నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రూ.82.23 కోట్ల నిధులతో జలాశయాల ఎగువ ప్రాంతాల్లో నాలుగు ఎస్టీపీ ప్లాంట్ల నిర్మాణ పనులు మొదలు పెట్టింది. వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా జలమండలి అధికారులు శరవేగంగా పనులు చేపడుతున్నారు. ఎస్టీపీల నిర్మాణం పూర్తయితే జంట జలాశయాలకు మురుగు ముప్పు తప్పుతుంది.

వ్యర్థ జలాలను అరికట్టేందుకు..

నగరవాసుల దాహార్తి తీర్చేందుకు నిజాం కాలంలో నిర్మించిన జంట జలాశయాలను మురుగు ముప్పు వెంటాడుతోంది. కొన్నేళ్లుగా జలాశయాల ఎగువ ప్రాంతాలైన మొయినాబాద్, శంషాబాద్, శంకర్‌పల్లి, గండిపేట మండలాల్లో కొత్త కాలనీలు ఏర్పడ్డాయి. మరోవైపు ఫాంహౌస్‌లు, విల్లాలు, ఇళ్లు, పరిశ్రమలు, హోటళ్లు, విద్యా సంస్థలు పెద్ద సంఖ్యలో వెలుస్తున్నాయి. దీంతో ఎగువ ప్రాంత గ్రామాల నుంచి భారీగా మురుగునీరు జలాశయాల్లో చేరుతుండడంతో కలుషితంగా మారుతున్నాయి. నిత్యం గండిపేట జలాశయంలోకి 29 లక్షల లీటర్లు, హిమాయత్‌సాగర్ జలాశయంలోకి 43.5 లక్షల లీటర్ల వ్యర్థ జలాలు కలుస్తున్నట్లు జలమండలి అధికారుల పరిశీలనలో తేలింది. దీన్ని అరికట్టేందుకు హైదరాబాద్ మెట్రో పాలిటన్ వాటర్ సప్లై సివరేజ్ బోర్డు ఎస్టీపీల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రూ.82.23 కోట్ల నిధులతో నాలుగు సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నిర్మించాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఒక్కో జలాశయం ఎగువ ప్రాంతంలో రెండు ఎస్టీపీల చొప్పున నిర్మాణ పనులను మొదలు పెట్టింది.



నాగిరెడ్డిగూడలో హిమాయత్‌సాగర్ జలాశయం వద్ద నిర్మిస్తున్న ఎస్టీపీ కేంద్రం

జలమండలి ప్రణాళికలు

జంట జలాశయాల్లో శుద్ధ జలమే లక్ష్యంగా జలమండలి చేపడుతున్న ఎస్టీపీల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గండిపేట జలాశయం పరిధిలో మొయినాబాద్ మున్సిపాలిటీలోని హిమాయత్‌నగర్ వద్ద 5 ఎంఎల్‌డీ, శంకర్‌పల్లి మండలంలోని జన్వాడ వద్ద 4 ఎంఎల్‌డీ, హిమాయత్‌సాగర్ జలాశయం పరిధిలో మొయినాబాద్ మండలంలోని నాగిరెడ్డిగూడ వద్ద 5 ఎంఎల్‌డీ, శంషాబాద్ మున్సిపాలిటీలోని కొత్వాల్‌గూడ వద్ద 6 ఎంఎల్‌డీల సామర్థ్యంతో ఎస్టీపీలను నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చినాటికి ఎస్టీపీల నిర్మాణం పూర్తిచేయడమే లక్ష్యంగా పనులను శరవేగంగా చేపడుతున్నారు. ఎస్టీపీల నిర్మాణం పూర్తయితే ఎగువ ప్రాంతంలోని గ్రామాలు, విల్లాలు, హోటళ్ల నుంచి వచ్చే మురుగు నీటిని ఎస్టీపీల్లోకి మళ్లించి శుద్ధి చేయనున్నారు. 2050 నాటికి ఉత్పన్నమయ్యే మురుగునీటి అంచనాతో మన్నెగూడతోపాటు మరి కొన్ని ప్రాంతాల్లో ఎస్టీపీలు నిర్మించేందుకు జలమండలి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

ఎస్టీపీల నిర్మాణం భేష్



గండిపేట, హిమాయత్‌సాగర్ జలాశయాల్లో మురుగునీరు చేరకుండా ప్రభుత్వం ఎస్టీపీల నిర్మాణం చేపట్టడం గొప్ప విషయం. ఎగువ ప్రాంతంలోని గ్రామాల నుంచి జలాశయాల్లోకి మురుగునీరు చేరకుండా అరికట్టొచ్చు. తద్వారా జలాశయాలు కలుషితం కాకుండా ఉంటాయి. ఇది భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– పల్లగొల్ల అశోక్‌యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, హిమాయత్‌నగర్

స్పోర్ట్స్ హబ్‌గా తెలంగాణ

- గ్రామీణ క్రీడాకారుల కోసం ప్రత్యేక క్రీడా పాలసీ
- ఒలింపిక్స్‌లో స్వర్ణమే లక్ష్యంగా శిక్షణ
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

నందిగామ: తెలంగాణను గ్లోబల్ స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (బీఏటీ) అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలోని కన్హా శాంతి వనంలోని గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తున్న ×యోనెక్స్ సన్‌రైజ్ 79వ సౌత్‌జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్– 2025 పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్యాడ్మింటన్ కేవలం ఒక ఆట మాత్రమే కాదని, జీవితానికి ఎన్నో పాఠాలు నేర్పే ఉత్తమ గురువు అని పేర్కొన్నారు. కోర్టులో పడిన ప్రతిసారీ లేచినిలబడే షటిల్ జీవితంలో మనకు ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి గొప్ప స్ఫూర్తినిస్తుందన్నారు. పుల్లెల గోపీచంద్, పీవీ సింధు, ప్రకాశ్ పదుకొనె, సైనా నెహ్వాల్, సాత్విక్, చిరాగ్, శ్రీకాంత్ వంటి దిగ్గజ క్రీడాకారులు బ్యాడ్మింటన్‌లో దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాడారు. క్రీడాకారులు కేవలం పాయింట్లకోసమే కాకుండా దేశం కోసం, దేశ ప్రతిష్టకోసం ఆడాలని సూచించారు. క్రమశిక్షణే అసలైన కోచ్ అని, నిరంతర శ్రమనే అసలైన స్పాన్సర్‌అని, ఆత్మ విశ్వాసం, గెలవాలనే పట్టుదలే నిజమైన బలమని మార్గనిర్దేశం చేశారు. అత్యుత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు రాష్ట్రంలో ప్రపంచ స్థాయి సౌకర్యాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చిందని గుర్తుచేశారు. త్వరలోనే జరగబోయే ఒలింపిక్స్ క్రీడల్లో మన రాష్ట్రం నుంచి బంగారు పతకం సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్‌తో కలిసి బ్యాడ్మింటన్ ఆడారు. మూడు రోజుల పాటు ఈ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బీఏటీ ప్రధాన కార్యదర్శి, బ్యాడ్మింటన్ నేషనల్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, పలు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి



దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ శ్రీవాత్సవతో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల/శంకర్‌పల్లి: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రైల్వే అండర్, రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాల ప్రగతిపై చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రైల్వే అధికారులతో మంగళవారం చర్చించారు. నగరంలోని రైల్వే కార్యాలయంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ, డీజీఎంలు ఉదయనాథ్, మల్లాది శ్రీనివాస్, సీపీఆర్ఓ శ్రీధర్‌తో సమావేశమయ్యారు. శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌ను అధునికీకరించాలని విజ్ఞప్తి చేశారు. కరోనాకి ముందుకు శంకర్‌పల్లిలో పలు ఎక్స్‌ప్రెస్ (ముంబై, హుబ్లీ, బీజాపూర్), డెమో ప్యాసింజర్ రైళ్లు ఆగేవని, ప్రస్తుతం వాటిని పునరుద్ధరించాలని కోరారు. పంట పొలాలకు వెళ్లేందుకు రైతుల కోసం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఫత్తేపూర్, మండల పరిధిలోని కొండకల్ వద్ద రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరగా వారు సానుకూలంగా స్పందించారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

7,52,259 మంది ఓటర్లు

- స్థానిక సంస్థల తుది జాబితా విడుదల
- తొలగించిన ఓట్లు 42,394



ఇబ్రహీంపట్నం: తుది జాబితా ప్రదర్శన

సాక్షి, రంగారెడ్డిజిల్లా: స్థానిక సంస్థల తుది ఓటర్ల జాబితా మంగళవారం విడుదలైంది. ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటన, అభ్యంతరాల స్వీకరణ, మార్పులు, చేర్పుల తర్వాత తుది జాబితాను వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 526 గ్రామ పంచాయతీలు ఉండగా, వీటి పరిధిలో మొత్తం 7,52,259 మంది ఓటర్లు ఉన్నారు. వీరి లో 3,76,823 మంది పురుషులు, 3,75,408 మంది మహిళలు, 28 మంది ఇతరులు ఉన్నారు. 4,668 వార్డులు, 4,682 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేశారు. 42,394 మృతులు, బోగస్ ఓట్లను తొలగించారు. ఇదిలా ఉంటే ఈ నెల 6న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితా ముసాయిదాను ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రకటించి, అభ్యంతరాల స్వీకరణ, సవరణల తర్వాత 10న తుది జాబితా వెల్లడించే అవకాశం ఉంది.

హైడ్రా టోల్ ఫ్రీ 1070

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) టోల్‌ఫ్రీ నంబర్ 1070 ఏర్పాటు చేసింది. ఇది మంగళవారం నుంచి అందుబాటులోకి వచ్చినట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. జలవనరుల పరిరక్షణలో సాధారణ ప్రజలనూ భాగస్వాముల్ని చేస్తున్న అధికారులు ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు రూపమిచ్చారు. చెరువులు, నాలాలతోపాటు పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాకు గురైతే ఆ సమాచారాన్ని ఈ టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా హైడ్రాకు అందించవచ్చు. చెట్లు పడిపోవడం, వరద ముంచెత్తడం, అగ్ని ప్రమాదాలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ ఈ నంబర్‌ను సంప్రదించడం ద్వారా హైడ్రా సేవలు, సహాయ సహకారాలు పొందవచ్చని పేర్కొన్నారు. దీంతోపాటు ఇప్పటికే అమలులో ఉన్న మరో మూడు ఫోన్ నంబర్లు సైతం పనిచేస్తాయని, వాటి సేవలూ కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఓఆర్‌ఆర్ పరిధిలో ప్రభుత్వ, ప్రజా ఆస్తుల పరిరక్షణ కోసం 871240 6899ను నేరుగా, వాట్సాప్ ద్వారా సంప్రదించవచ్చు. ఆయా ఆక్రమణలు, ఉల్లంఘనలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సైతం ఈ నంబర్‌కు షేర్ చేయవచ్చు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, భారీ వర్షాలు పడి కాలనీలు, రహదారులు నీట మునిగినప్పుడు, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు 87124 06901, 9000113667 నంబర్లకు కూడా ఫోన్ చేయవచ్చు. ఈ మూడు సెల్ నెంబర్లతోపాటు టోల్ ఫ్రీ నెంబర్ నిర్విరామంగా పని చేస్తూ ఉంటాయని స్పష్టం చేశారు.

పెన్షన్ హామీ విస్మరించిన ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకివస్తే పెన్షన్ పెంచి ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఏమైందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాగల్ల ఉపేందర్ ప్రశ్నించారు. పట్టణంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచి ఇస్తానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి హామీని విస్మరించారని విమర్శించారు. దివ్యాంగులకు రూ.6వేలు, చేయూత పెన్షన్ రూ. 4వేలు పెంచుతామని, ఎన్నికలు అయిపోయిన వెంటనే పెరిగిన పెన్షన్ తీసుకోవాలని చెప్పి ఇప్పటివరకు ఒక్క పైసా కూడా పెంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెన్షన్‌దారులకు మద్దతుగా పోరాడేందుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ శ్రీకారం చుడుతున్నారని, అందులో భాగంగా ఈ నెల 8న షాద్‌నగర్‌లో పెన్షన్‌దారుల మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులు, గీత కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు చిన్నోళ్ల అనంతయ్య, బుర్ర రాంచంద్రయ్య, రవికుమార్, ఆనంద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై కట్టుకథలు

- కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకే..
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి



బాలాపూర్ చౌరస్తాలో చేపట్టిన నిరసనలో మాట్లాడుతున్న సబితారెడ్డి



ఇబ్రహీంపట్నం ప్రధాన రోడ్డుపై బైఠాయించిన బీఆర్‌ఎస్ నేతలు

మీర్‌పేట: కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు గుండెకాయ వంటిదని, మాజీ సీఎం కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి మండిపడ్డారు. దుష్ప్రచారాన్ని నిరసిస్తూ మంగళవారం బాలాపూర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేసి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాళేశ్వరం అత్యద్భుతమని, 20 లక్షల ఎకరాలకు నీరందించే ప్రాజెక్టు అని సుప్రీం కోర్టు నివేదిక ఇచ్చిందని, ప్రాజెక్టులపై రాజకీయం చేయొద్దని చెప్పిందని గుర్తుచేశారు. అయినప్పటికీ తెలంగాణను బలి చేసైనా పక్క రాష్ట్రంలోని బనకచర్లకు నీరివ్వాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి మేడిగడ్డను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఓ వైపు మోదీ, మరోవైపు గురువు చంద్రబాబుకు మేలు చేసేందుకు రాష్ట్రాన్ని ఎండబెట్టాలని రేవంత్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని, లేదంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, బీఆర్‌ఎస్ నాయకులు మురుకుంట్ల అరవింద్, అర్కల కామేశ్‌రెడ్డి, సునితా బాల్‌రాజ్, సూర్లగంటి అర్జున్, జటావత్ శ్రీను నాయక్, పెండ్యాల నగేష్, అనిల్‌యాదవ్, బొక్క రాజేందర్‌రెడ్డి, మాదరి రమేష్ పాల్గొన్నారు.

కక్షపూరిత రాజకీయాలు

ఇబ్రహీంపట్నం: కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుకథలు చెబుతూ కుట్రలు చేస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం సీబీఐ అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ, యూరియా కొరతలపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నంలో భారీ ర్యాలీ నిర్వహించి, రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యలను గాలికొదిలేసి, కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. యూరియా కొరతతో రైతులు అల్లాడుతుంటే పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. పార్టీ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్ మాట్లాడుతూ.. కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఘోష్ కమిషన్ విచారణ ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి, భరత్‌కుమార్, జంగయ్య, జెర్కొని రాజు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు

హుడాకాంప్లెక్స్: వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. సరూర్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డెంగీ వంటి విషజ్వరాలు రాకుండా అవగాహన కల్పించాలని, ఆస్పత్రికి వచ్చే బాధితులకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీత, మెడికల్ ఆఫీసర్ అర్చన, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేరాల కట్టడిలో 'సీసీ'లు కీలకం

శంషాబాద్ అదనపు డీసీపీ పూర్ణచందర్



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న అదనపు డీసీపీ పూర్ణచందర్

ఆమనగల్లు: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని శంషాబాద్ అదనపు డీసీపీ పూర్ణచందర్ అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 30 సీసీ కెమెరాలు, మండల పరిధిలోని గట్టుప్పలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను మంగళవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. సీసీ కెమెరాల ఏర్పాటు ప్రజల భద్రతకు నూతన అడుగు అన్నారు. ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలు తగ్గించడంలో కెమెరాలు కీలకంగా పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, ఆమనగల్లు సీఐ జానకీరాంరెడ్డి, తలకొండపల్లి ఎస్‌ఐలు శ్రీకాంత్, శేఖర్, మాజీ సర్పంచ్ జ్యోతయ్య, కానిస్టేబుల్ జాషువ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

ఆమనగల్లు పట్టణంలోని సురసముద్రం చెరువు వద్ద వినాయకుల నిమజ్జన ఏర్పాట్లను శంషాబాద్ అదనపు డీసీపీ పూర్ణచందర్ పరిశీలించారు. నిమజ్జనానికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. మున్సిపల్ సిబ్బంది, పోలీసుశాఖ సమన్వయంతో నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఆయన సూచించారు.

మట్టి తొలగించాలని ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వేములనర్వ గ్రామస్తులు

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులో ఉన్న శ్మశానవాటిక వెళ్లకుండా కొందరు రియల్టర్లు మట్టిని అడ్డంగా వేసినట్టు గ్రామానికి చెందిన పలువురు మంగళవారం తహసీల్దార్ అజాంఅలీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డిలకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. శ్మశానవాటిక పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తులతో పాటుగా రియల్టర్లు మట్టిని పోశారన్నారు. దీంతో వర్షం నీరు బయటికి వెళ్లడం లేదన్నారు. గ్రామంలో ఎవరైనా మరణిస్తే దహన సంస్కారాలకు వెళ్లడానికి వీలుకావడం లేదన్నారు. అధికారులు స్పందించి శ్మశానవాటిక నుంచి నీరు బయటికి వెళ్లే విధంగా మట్టిని తొలగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మల్లేష్, శ్రీను, దాసునాయక్, రాఘవేందర్, శ్రీకాంత్, శ్రీశైలం, ఎల్లయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంకండి

అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

ఇబ్రహీంపట్నం: బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి మంగళవారం సందర్శించారు. పలు కీలక అంశాలపై రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఓటర్ల తుది జాబితా, ఫార్మాసిటీ భూములు, సర్వేయర్ల సమస్య, భూభారతిలో వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారానికి చేపట్టిన చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో చోటుచేసుకున్న అసైన్డ్ భూముల వ్యవహారంపై ఆరా తీశారు. సమావేశంలో ఆర్డీవో అనంతరెడ్డితో పాటు తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాజునాయక్

షాద్‌నగర్‌రూరల్: గత ఎన్నికల సమయంలో సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజునాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీపీఎస్ విధానంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు భవిష్యత్‌లో ఉద్యోగ భద్రత లేదని ఆరోపించారు. ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని అనేక సార్లు ఆందోళన కార్యక్రమాలను చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయబద్ధమైన సామాజిక భద్రతతో కూడిన పాతపెన్షన్ విధానాన్ని అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని కోరారు.

బీఆర్‌ఎస్ నాయకులపై కేసు నమోదు

షాద్‌నగర్‌రూరల్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు అప్పగించడంతో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళనలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో నాయకులు పట్టణంలోని ముఖ్యకూడలిలో ధర్నా చేపట్టి రాస్తారోకో నిర్వహించారు. ఈ ధర్నాకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులపై కేసులు నమోదు చేసినట్లు తెలుస్తుంది. ధర్నా కార్యక్రమానికి ముందస్తుగా పోలీసుశాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడం, ట్రాఫిక్ జాంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించారనే నేపథ్యంలో కేసులు చేసినట్లు సమాచారం. ఈ ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేతో పాటు సుమారు 20 మందికి పైగా బీఆర్‌ఎస్ నేతలపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం.

బైక్ ఢీకొని యువకుడి మృతి

పోచారం: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు మృతి చెందిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చౌదరిగూడలోని సాయిబాబానగర్‌కు చెందిన కొమ్ము వంశీ (21) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి అతను కొర్రెముల్ నుంచి చౌదరిగూడకు వస్తుండగా శ్రీసాయి ఎన్‌క్లేవ్ వద్ద ఎదురుగా వస్తున్న పల్సర్ బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు.

అలైన్‌మెంట్ ఖరారు

- వందమీటర్ల వెడల్పుతో రీజనల్ రింగ్ రోడ్డు
- జిల్లాలోని ఆరు మండలాలు, 26 గ్రామాల్లో రహదారి
- నోటిఫికేషన్ విడుదల చేసిన హెచ్‌ఎండీఏ
- ఈ నెల 15 వరకు అభ్యంతరాల స్వీకరణ



ఆమనగల్లు మండలం మేడిగడ్డతండా సమీపంలో ఆర్‌ఆర్‌ఆర్ కోసం వేసిన మార్కింగ్



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సింగంపల్లి గ్రామస్తులు

ఆమనగల్లు: రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అలైన్‌మెంట్ ఖరారైంది. ఈ మేరకు హెచ్‌ఎండీఏ ప్రాథమిక నోటిఫికేషన్‌ ఇటీవల విడుదల చేసింది. ఆర్‌ఆర్‌ఆర్‌ను వంద మీటర్ల వెడల్పుతో నిర్మించనున్నారు. జిల్లాలోని ఆరు మండలాల పరిధిలో 26 రెవెన్యూ గ్రామాల మీదుగా నిర్మించనున్నారు. ఈ మేరకు ఏఏ మండలాలలో ఏఏ గ్రామాలలో రోడ్డు నిర్మిస్తున్నారో నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ మేరకు హెచ్‌ఎండీఏ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. ఇన్నాళ్లు ట్రిబుల్‌ఆర్ నిర్మాణంతో తమ పొలాలు పోతున్నాయో లేదో అంటూ ఎదురుచూసిన రైతుల ఉత్కంఠకు తెరదించారు. ప్రాథమిక నోటిఫికేషన్‌పై ప్రజలు, సంస్థలు తమ అభ్యంతరాలను ఈనెల 15 లోగా రాతపూర్వకంగా తెలియజేయాలని హెచ్‌ఎండీఏ కోరింది.

ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల

రాష్ట్రంలో ఎనిమిది జిల్లాల మీదుగా వంద మీటర్ల వెడల్పుతో రీజనల్ రింగ్ రోడ్డును నిర్మించనున్నట్లు వివరాలు హెచ్‌ఎండీఏ వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుకు సుమారు 40 కిలోమీటర్ల దూరంతో రెండు భాగాలుగా నిర్మించనున్నారు. ఇప్పటికే ఉత్తరభాగం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు టెండర్లు కూడా పిలిచింది. తాజాగా దక్షిణభాగం రోడ్డుకు ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్‌లో డిజిటల్ మ్యాప్‌తో పాటు ఆర్‌ఆర్‌ఆర్ వెళ్లే సర్వే నంబర్ల వివరాలను వెల్లడించారు.

ట్రిబుల్‌ఆర్ లోపలే మాడ్గుల, ఆమనగల్లు

ట్రిబుల్‌ఆర్ లోపలికే ఆమనగల్లు, మాడ్గుల మండల కేంద్రాలు రానున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అలైన్‌మెంట్ ప్రకారం ఆమనగల్లు మండలంలోని విఠాయిపల్లి, ఆకుతోటపల్లి, శెట్టిపల్లి, మాడ్గుల మండలంలోని కొల్కులపల్లి, నర్సాయిపల్లి గ్రామాల మధ్య నిర్మించనున్నట్లు అప్పట్లో సర్వే చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ట్రిబుల్‌ఆర్ అలైన్‌మెంట్ కోసం మరోసారి సర్వే నిర్వహించారు. రోడ్డును మాడ్గుల మండల కేంద్రం బయట నుంచి నిర్మించాలని, కాంగ్రెస్ నాయకులు కోరడంతో అలైన్‌మెంట్‌లో భారీగా మార్పులు జరిగాయి. ప్రస్తుతం ఆమనగల్లు, మాడ్గుల మండల కేంద్రాలు ఆర్‌ఆర్‌ఆర్ లోపలే ఉంటున్నాయి.

26 గ్రామాల మీదుగా..

జిల్లా పరిధిలోని ఆరు మండలాలలోని 26 రెవెన్యూ గ్రామాల మీదుగా ట్రిబుల్‌ఆర్ నిర్మించనున్నట్లు ప్రకటించారు. మండలంలోని ఆమనగల్లు, చెన్నంపల్లి, పోలెపల్లి, సింగంపల్లి, కేశంపేట మండలంలోని నిడుదవెల్లి, తొమ్మిదిరేకుల, ఫరూక్‌నగర్ మండలంలోని భీమారం, చింపోడు, కొందుర్గు మండలంలోని ఆగిర్యాల, కొందుర్గు వెస్ట్, తంగళ్లపల్లి, వనంపల్లి, చెర్కుపల్లి, కొందుర్గు ఈస్ట్, మాడ్గుల మండలంలోని ఇర్విన్, కలకొండ, మాడ్గుల, అన్నెబోయినపల్లి, బ్రాహ్మణపల్లి, తలకొండపల్లి మండలంలోని కానాపూర్, మెదక్‌పల్లి, రాంపూర్, వెంకట్రావ్‌పేట, చంద్రదన, గౌరిపల్లి, జూలపల్లి గ్రామాలున్నాయి.

భూములు తీసుకోవద్దని వినతి

ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణంతో తమ భూములు పోకుండా చూడాలని పలు గ్రామస్తులు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ ఖరారు చేస్తూ వివిధ గ్రామాలు, సర్వే నంబర్ల వివరాలను వెల్లడించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కసిరెడ్డిని ఆమనగల్లు మండలం సింగంపల్లి, తలకొండపల్లి మండలం గౌరిపల్లి, నల్లరాల్ల తండాకు చెందిన పలువురు రైతులు కలిసి ఆర్‌ఆర్‌ఆర్‌లో తమ భూములు పోకుండా చూడాలని అభ్యర్థించారు.

మురుగునీటి శుద్ధి చేపట్టాలి

నాగ్‌పూర్ హైడ్రోజియాలజీ ఇన్‌చార్జి, సీఎంపీడీఐఎల్ మేనేజర్ రాంబాబుసింగ్



సదస్సులో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

మొయినాబాద్: పర్యావరణ పరిరక్షణ కోసం వికేంద్రీకృత మురుగునీటి శుద్ధి చేపట్టాలని నాగ్‌పూర్ హైడ్రో జియాలజీ విభాగం ఇన్‌చార్జి, సీఎంపీడీఐఎల్ మేనేజర్ రాంబాబుసింగ్ అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో 'బలమైన గ్రామీణ, నగర సమదాయాల కోసం.. స్థిరమైన నీరు, వ్యర్థాల పరిష్కారాలు' అనే అంశంపై మూడు రోజుల పాటు జరిగే 'ఎస్‌డబ్ల్యూడబ్ల్యూస్ 2025' జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మురుగునీటిని పెద్ద కేంద్రీకృత ప్లాంట్లకు తరలించకుండా, దాని ఉత్పత్తి మూలం వద్దనే శుద్ధి చేయడంతో ఖర్చు తక్కువ అవుతుందన్నారు. వ్యర్థ జలాలను శుద్ధి చేయడం ద్వారా నదులు, చెరువులు, భూగర్భ జలాలు కలుషితం కాకుండా ఉంటాయన్నారు. చిన్న పరిశ్రమలు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని చిన్న చిన్న సముదాయాల్లో తక్కువ ఖర్చుతో వికేంద్రీకృత మురుగునీటి శుద్ధిని సమర్థవంతంగా చేపట్టవచ్చన్నారు. ఈ సందర్భంగా సావనీర్ విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రోహిత్ కందకట్ల, ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎంఎస్ నర్సయ్య, కోఆర్డినేటర్ సౌమ్య సుచరిత సింఘా, అధ్యాపకులు పాల్గొన్నారు.

హెచ్‌ఎండీఏ ప్రీ బిడ్‌కు విశేష స్పందన

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) నిర్వహించిన ప్రీబిడ్ సమావేశానికి విశేషమైన స్పందన లభించింది. తుర్కయంజాల్, బాచుపల్లిల్లోని ప్రభుత్వ స్థలాల విక్రయానికి హెచ్‌ఎండీఏ ఇదివరకే నోటిఫికేషన్ వెలువరించిన సంగతి తెలిసిందే. ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించనున్న ఈ స్థలాల కోసం మంగళవారం ప్రీబిడ్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తుర్కయంజాల్‌లోని 12 ప్లాట్ల అమ్మకాలపై అనూహ్యమైన స్పందన లభించింది. ఆసక్తి గల కొనుగోలుదార్లు, పలు నిర్మాణ, రియల్ ఎస్టేట్ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. సమావేశంలో హెచ్‌ఎండీఏ ఎస్టేట్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి వేలం ప్రక్రియ గురించి వివరించారు. ఎమ్మెస్టీసీ ప్రతినిధులు ఆన్‌లైన్ బిడ్డింగ్ గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సమావేశంలో హెచ్‌ఎండీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధన్‌మోహన్ సింగ్, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి సత్యనారాయణ, ప్రజాసంబంధాల అధికారి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని జలమండలి తట్టిఖానా వాటర్ రిజర్వాయర్ సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని రెండు గ్రూపులు ఆక్రమించేందుకు యత్నించడమేగాక ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను తుడిచేసి కబ్జాదారులు తమ పేర్లను రాసుకున్నారు. దీనిపై సమాచారం అందడంతో పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. షేక్‌పేట మండలం, బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఎదురుగా ఐదెకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ స్థలం ఉంది. సదరు స్థలానికి రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఇందులో ఎకరన్నర స్థలాన్ని జలమండలికి కేటాయించారు. మిగతా మూడున్నర ఎకరాల స్థలం మండల రెవెన్యూ ఆధీనంలో ఉంది. రూ.400 కోట్ల విలువైన ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు పార్థసారధి, అతడి కుమారుడు విజయ్ భార్గవ్‌లు పలుమార్లు ప్రయత్నించారు. అంతటితో ఆగకుండా రౌడీలను నియమించుకుని సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి చుట్టూ బ్లూషీట్స్ కూడా నిర్మించుకున్నారు. రెవెన్యూ అధికారులు గతంలోనే మూడుసార్లు ఈ స్థలంలోకి వెళ్లి ఆక్రమణలను తొలగించి పార్థసారధి, విజయ్ భార్గవ్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినా వారు తమ వైఖరి మార్చుకోలేదు. ఇటీవల జలమండలి, రెవెన్యూ అధికారులు ఈ స్థలంపై జోక్యం చేసుకోవద్దంటూ స్టే కూడా తీసుకువచ్చారు. అయితే రెండు రోజుల క్రితం పార్థసారధి అనుచరులు ఒకవైపు, ఇదే స్థలాన్ని తనదిగా పేర్కొంటున్న విద్యాసాగర్ అనుచరులు మరోవైపు..ఈ స్థలంలోకి చొరబడ్డారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడమే కాకుండా స్థలంలో తమ పేర్లతో బోర్డులను కూడా ఏర్పాటుచేసుకున్నారు. దీంతో పోలీసులు ఇరువర్గాలకు చెందిన వారిని అదుపులోకి తీసుకున్నారు. విజయ్‌భార్గవ్ సోమవారం రాత్రి ఈ స్థలంలోకి చొరబడి వీఆర్ ఇన్‌ఫ్రా పేరుతో మరోసారి ఆక్రమణలకు యత్నించడంతో సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్ డీసీపీ మంగళవారం ఘటనా స్థలాన్ని సందర్శించారు.

అనాథ శరణాలయం పేరుతో టోకరా

బంజారాహిల్స్: తాను అనాథ శరణాలయం నుంచి ఫోన్ చేస్తున్నానని, శరణాలయానికి రూ.10,157 చెల్లిస్తే ప్రతినెలా మీ ఖాతాలో రూ.11,100 జమ అవుతుందని నమ్మించి ఓ వ్యక్తిని బురిడీ కొట్టించిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..బంజారాహిల్స్ ఉదయ్‌నగర్‌కు చెందిన గోపిరెడ్డి మహేశ్వర్ వ్యవసాయ శాఖలో పని చేస్తున్నాడు. గత నెల 31న రాత్రి అతడికి గుర్తుతెలియని నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. తాను అనాథ శరణాయం నుంచి ఫోన్ చేస్తున్నానని, రూ.10,157 చెల్లిస్తే ప్రతినెలా మీ ఖాతాలో రూ.11.100లు జమ అవుతాయని చెప్పాడు. అతడి మాటలు నమ్మిన మహేశ్వర్ ఆ మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా పంపించాడు. ఆ తర్వాత పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన అతను పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మా వారిని విడుదల చేయించండి



లేఖను ప్రదర్శిస్తున్న ఖైదీల కుటుంబ సభ్యులు

పంజగుట్ట: క్షణికావేశంలో నేరాలకు పాల్పడి ఏళ్ల తరబడి జీవిత ఖైదు అనుభవిస్తున్న తమ వారిని క్షమాభిక్ష ప్రసాదించి జైలు జీవితం నుంచి విముక్తి కలిగించాలని జీవిత ఖైదీల కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖైదీల కుటుంబ సభ్యులు స్వప్న, బీచుపల్లి షరీఫ్, రాజేష్, అనీల్ కుమార్ మాట్లాడుతూ .. క్షణికావేశంలో చేసిన నేరాలతో జైలు జీవితాన్ని అనుభవిస్తున్న వారి పరిస్థితి ఒకలా ఉంటే వారిపై ఆధారపడ్డ వారి పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. భర్త దూరమై ఒకరు, తండ్రి దూరమైన పిల్లలు, సోదరుడు దూరమై, వృద్ధాప్యంలో ఉన్న వారు కొడుకులను దూరమై నరక యాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానవతాధృక్పథంతో స్పందించి గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న తమ వారికి క్షమాభిక్ష ప్రసాదించి సాధారణ జీవితాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

సెంట్రల్ లైటింగ్ పోల్ మీదపడి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుర్మరణం




స్వాథిక్ (ఫైల్)

మల్లాపూర్: విద్యుత్ సెంట్రల్ లైటింగ్ పోల్ మీద పడి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి చెందిన సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగళవారం తెల్లవారుజామున స్థానిక వీఎస్టీ కాలనీకి చెందిన భజరంగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్నారు. అదే సమయంలో కార్తికేయనగర్‌కు చెందిన స్వాథిక్ (23) బైక్ ఆ మార్గంలో వెళుతున్నాడు. మార్గమధ్యలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ సమీపంలో వినాయకుడిని తరలిస్తున్న లారీ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభానికి కట్టిన కేబుల్ వైర్‌ను తాకింది. దీంతో రెండు స్తంభాలు విరిగిపోయాయి, ఒక స్తంభం గణేష్ విగ్రహంపై పడగా, మరో స్తంభం విరిగి సాత్విక్ తలపై పడటంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వాహనం డ్రైవర్ ఏడుకొండలు, భజరంగ్ యూత్ అసోసియేషన్ ఆర్గనైజర్ వెంకటేష్‌పై పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.

వినాయక చవితికి వచ్చి అనంతలోకాలకు..

స్వాథిక్ పూణేలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. గణేష్ నవరాత్రి ఉత్సవాలకు నాచారం వచ్చిన అతను బెంగళూరు నుంచి వచ్చిన తన స్నేహితుడి కలిసేందుకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా మృత్యువాత పడ్డాడు.

రైలుకిందపడి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య



బూక్యా పట్నాయక్ మృతదేహం

సికింద్రాబాద్: రైలుకిందపడి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రైల్వే సికింద్రాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మంగళవారం ఉదయం చర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడిని మహబూబ్‌నగర్ జిల్లా, నెల్లికుదురుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బూక్యా పట్నాయక్ (28) గా గుర్తించారు. నెల్లికుదురు గ్రామానికి చెందిన రైతు బూక్యా బాలాజీ కుమారుడు పట్నాయక్ నగరంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ చెంగిచెర్లలోని తన సోదరి ఇంట్లో ఉంటున్నాడు. మృతుడి వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా కొరత తీర్చండి

సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య



ఇబ్రహీంపట్నంలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: యూరియా కొరతను తీర్చి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఇబ్రహీంపట్నంలో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉంచాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే సాగు విస్తీర్ణంపై అంచనా వేసి సకాలంలో యూరియాను అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ఆరోపించారు. రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు యూరియా అంశంపై కేంద్రాన్ని నిలదీయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చి యూరియా పంపిణీ చేయాలని నొక్కి చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సామేల్, చంద్రమోహన్, జగదీష్, నర్సింహ, కవిత, శోభన్, అంజయ్య, జంగయ్య, రుద్రకుమార్, సుమలత, బుగ్గరాములు, విజయ్‌కుమార్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన రైతులు

షాబాద్: వానాకాలం పంటల సాగు ఊపందుకోవడంతో రైతులు యూరియా కోసం నానా తంటాలు పడుతున్నారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం పక్కనే ముంబాయి- బెంగళూరు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు కిలోమీటర్లు పొడవునా వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. గంటల తరబడి క్యూలో నిల్చుంటే యూరియా ఇవ్వకపోవడంతో రైతులు ధర్నాకు దిగారు. షాబాద్ సీఐ కాంతారెడ్డి రైతులకు నచ్చజెప్పి ధర్నాను విరమించారు.



షాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు



షాబాద్: రైతులను సముదాయిస్తున్న సీఐ కాంతారెడ్డి